కులగణనతో కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్

- బీసీలు 46% అని తేల్చడంతో ఆ సామాజిక వర్గంలో ఆగ్రహం
- బీసీలకు డిప్యూటీ సీఎంతోపాటు మరిన్ని మంత్రి పదవులు ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): కులగణనతో కాంగ్రెస్ ప్రభుత్వం సెల్ఫ్‌గోల్ చేసుకున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎక్కడైనా సర్వే చేస్తే జనాభా పెరగాలి కానీ తగ్గడం ఏమిటని ప్రశ్నించారు. శుక్రవారం ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే, ఆధార్‌కార్డులు, ఓటరు లిస్టుల ఆధారంగా బీసీల జనాభా 50 శాతానికిపైగా ఉన్నట్టు తేలిందని తెలిపారు. తాజాగా ప్లానింగ్ శాఖ చేపట్టిన సర్వేలో బీసీలు 46% మాత్రమే ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో ఆ సామాజికవర్గంలో ఆగ్రహం వ్యక్తమవుతున్నదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నదని, అందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌లో స్థానికసంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో సుప్రీంకోర్టు తీర్పుతో అడ్డంకులు ఉన్నాయని ప్రభుత్వానికి ముందే తెలుసని అన్నారు. హామీల అమలు చేతకాక అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని చెప్తున్నారని మండిపడ్డారు. ఈ అంశంలో చేసేదేమీలేక పార్టీ తరఫున టికెట్లు ఇస్తాం.. మీరు ఇవ్వండంటూ సీఎం రేవంత్‌రెడ్డి కొత్తడ్రామాకు తెరలేపారని విమర్శించారు.

క్యాబినెట్‌లో సమతుల్యత ఏదీ?

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే జనాభా ప్రతిపాదికన బడ్జెట్ కేటాయింపులు జరుపాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. క్యాబినెట్‌లో మరికొంత మంది బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్‌కు బీసీలపై ప్రేమ ఉంటే బీసీకి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. క్యాబినెట్‌లో సమతుల్యత పాటించకుండా బీసీలకు ఎలా న్యాయం చేస్తారని నిలదీశారు. బీసీలకు గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వే నివేదికలో ఏ కులానికి చెందిన వారు ఎంత మంది అనే విషయాన్ని వెల్లడించకపోవడంపై సందేహం వ్యక్తంచేశారు. అసెంబ్లీలో తమ పార్టీకి చెందిన బీసీ ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, ఎమ్మెల్యేలకు పది నిమిషాలు మాత్రమే మాట్లాడే అవకాశం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

ఉప ఎన్నికల్లో పదికి పది గెలుస్తాం

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటం ఖాయమని, రాష్ట్రంలో తప్పకుండా ఉపఎన్నికలు వస్తాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉప ఎన్నికలు వస్తే పదికి పది స్థానాల్లో బీఆర్ఎస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని, కేసీఆర్ పాలనే బాగున్నదనే అభిప్రాయం ఉన్నదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఈ నెలలో నిర్వహించే భారీ బహిరంగ సభ తేదీ, వేదికను రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయిద్దామని కేసీఆర్ సూచించారని తెలిపారు. పార్టీలో కమిటీల ఏర్పాటు విషయమై స్పందిస్తూ.. పార్టీ నియమావళి ప్రకారం ప్రతి నాలుగేండ్లకు పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని తెలిపారు. 2025 అక్టోబర్ నాటికి అధ్యక్షుడి పదవీకాలం ముగుస్తుందని వెల్లడించారు. ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. తర్వాత గ్రామ, వార్డు, మండల, పట్టణ అధ్యక్షులను ఎన్నుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ ఉంటుందని, ఆ తర్వాత రాష్ట్ర కార్యవర్గం, పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని వివరించారు.

మల్లంపేటలోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో బీసీ నేతలతో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనచారి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, బూడిద భిక్షమయ్యగౌడ్, నోముల భగత్, ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్, నేతలు తుల ఉమ, పల్లె రవికుమార్, చెరుకు సుధాకర్

బీసీల గొంతుక బీఆర్ఎస్సే

మొదటిపేజీ తరువాయి...

నియోజకవర్గ పర్యటన ముగించుకొని హైదరాబాద్ వెళ్తున్న కేటీఆర్, మల్లంపేట సమీపంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసం వద్ద కొద్దిసేపు ఆగారు. అక్కడ అందుబాటులో ఉన్న బీసీ నేతలతో మాట్లాడారు. నాడైనా నేడైనా భవిష్యత్తులో అయినా బలహీనవర్గాలకు బలమైన గొంతుక బీఆర్ఎస్సేనని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని కేటీఆర్ చెప్పారు. బీసీలకు న్యాయం చేసే దిశగా 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు అవసరమైన రాజ్యాంగసవరణ కోసం పోరాడుతామని తెలిపారు. బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం దొంగదెబ్బ కొడుతున్నదని, కులగణన పేరుతో కుతంత్రాలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. శాసనసభలో బీసీ కులగణనపై కేవలం స్టేట్‌మెంట్ మాత్రమే ఇచ్చి బీసీ రిజర్వేషన్లు చేసినట్టు డబ్బా కొట్టుకుంటున్నదని విమర్శించారు.

కులగణన తప్పులతడక

రాష్ట్ర ప్రభుత్వం కులగణను మాత్రమే చేసిందని, అదీ తప్పులతడకగా ఉన్నదని కేటీఆర్ సోదాహరంగా వివరించారు. గతంలో ఎన్నడూలేనివిధంగా రాష్ట్రంలో కేవలం బీసీ జనాభా మాత్రమే ఎందుకు తగ్గిందని అనుమానం వ్యక్తంచేశారు. బీసీ జనాభా 5 శాతం మేరకు తగ్గినట్టు చూపించారని, అంటే ప్రభుత్వం 22 లక్షల మందిని మాయం చేసినట్టు అని వివరించారు. బీసీలపై ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బీసీల జనాభా తగ్గించి వారికి ప్రభుత్వ పరంగా దక్కాల్సిన ఫలాలను ఎగ్గొట్టవచ్చని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు కనిపిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ చిత్తశుద్ధితో బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో కులగణన చేపట్టలేదని, ఏదో మొక్కబడిగా నిర్వహించిందని, తమిళనాడు వెళ్లి పరిశీలించి వచ్చిన వాళ్లు అక్కడ చేసినట్టు ఇక్కడ ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు.

బీసీలకు న్యాయం చేసింది కేసీఆరే

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బీసీలకు పెద్దపీట వేశారని కేటీఆర్ గుర్తుచేశారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం ఇవ్వడమే కాకుండా కులవృత్తులను ప్రోత్సహించారని, మార్కెట్ కమిటీలు మొదలు చివరకు మద్యం షాపుల్లో కూడా రిజర్వేషన్లు పెట్టి బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పైకి తెచ్చే ప్రయత్నం చేశారని చెప్పారు. తెలంగాణలో గడిచిన పదేండ్లలో జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ నేతలకు ప్రాధాన్యత ఇచ్చి, వారి రాజకీయ ఎదుగుదలకు బీఆర్ఎస్ పాటుపడిందని గుర్తుచేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో బహుజనులను అన్నిరంగాల్లో నిలబెట్టేందుకు బీఆర్ఎస్ శక్తివంచన లేకుండా కృషిచేసిందని, బడుగుల కోసం నిలుస్తుందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ బలం, బలగం సబ్బండవర్గాలేనని పునరుద్ఘాటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేద్దామని చెప్పారు. ఇందుకోసం ఈనెల 9న తెలంగాణ భవన్‌లో బీసీలతో సమావేశమవుదామన్నారు. సమావేశానికి పార్టీకి చెందిన బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు హాజరుకావాలని చెప్పారు. అందరితో చర్చించి సమగ్ర కార్యాచరణ రూపొందిద్దామన్నారు. సమావేశంలో శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జోగు రామన్న, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, నోముల భగత్, కోరుకంటి చందర్, అంజయ్య యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, చెరుకు సుధాకర్, అంజనేయులుగౌడ్, పల్లె రవికుమార్ గౌడ్, క్యామ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కరివేపాకులా బీసీలు

- కులగణనపై చిత్తశుద్ధిలేని సర్కార్
- ఇప్పటికైనా నిపుణుల కమిటీని వేయాలి
- ప్రొఫెసర్లు మురళీమనోహర్, తిరమలి, సమ్మయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి7 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ పార్టీ బీసీలను కరివేపాకులా వాడుకున్నది. అసలు ఆ వర్గాలపైనే చిన్నచూపుగా ఉన్నది. ఏడాది దాటినా బీసీ సబ్‌ప్లాన్, ఇతర కులకార్పొరేషన్ల ఏర్పాటు, వృత్తిదారుల సంక్షేమం, నామినేటెడ్ పదవుల్లో కోటా, సరిపోను బడ్జెట్ కేటాయింపులు సహా మ్యానిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడమే లేదు' అని పీపుల్ కమిటీ ఆఫ్ క్యాస్ట్ సెన్సెస్ (పీసీసీసీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులైన ప్రొఫెసర్లు మురళీమనోహర్, తిరమలి, సింహాద్రి, రాధాకృష్ణ, డాక్టర్ వేణుయాదవ్, దేవళ్ల సమ్మయ్య, నరేంద్రబాబు, సుదర్శన్ రావు, తుల్జారాంసింగ్, పృథ్వీరాజ్‌యాదవ్, సతీశ్ కొట్టె శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కులగణనపై కాంగ్రెస్ సర్కారుకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, ఆది నుంచి ఒంటెద్దు పోకడలతో ఇష్టానుసారంగా ముందుకు సాగుతున్నదని ధ్వజమెత్తారు. బీసీ జనాభా తగ్గుదలపై ఆక్షేపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆర్భాటంగా బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించిందని, కులగణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. సర్వే అంశంలో ఇష్టానుసారంగా, ఎలాంటి ప్రామాణిక పద్ధతులను పాటించకుండా, నిపుణులతో ఎలాంటి సంప్రదింపులు జరకుండా, మేధోచర్చలు జరపకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగిందని విమర్శించారు. కనీసం సర్వే పర్యవేక్షణకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో అనేక లోపాలు దొర్లాయని పేర్కొన్నారు. అసంబద్ధంగా వివరాలను సేకరించిందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్లను సాధించడానికి అవకాశాలు ఉన్నాయని, అందుకు అనుసరించాల్సిన విధానాలను జస్టిస్ ఈశ్వరయ్య వ్యయ ప్రయాసలకోర్చి సీఎంకు నివేదిక సమర్పించారని తెలిపారు. ఇప్పటికైనా నిపుణుల కమిటీ, అన్ని అంశాలపై చర్చించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

డెడికేటెడ్ కమిషన్‌కు రూ.60 లక్షలు మంజూరు

హైదరాబాద్, ఫిబ్రవరి7 (నమస్తే తెలంగాణ): బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు సిఫారసులు చేసేందుకు ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్‌కు ప్రభుత్వం రూ. 60 లక్షలను మంజూరు చేసింది. న్యాయ నిపుణులు, రీసెర్చ్ స్కాలర్లు, ఇతర క్లిరకల్ ఉద్యోగుల నియామకానికి సంబంధించి జీతభత్యాలు, రవాణా అలవెన్స్‌లకు రూ. 60 లక్షలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నేటి నుంచి గాంధీనాయక్ ఆమరణ దీక్ష

- స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని నిరసన

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తేతెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయాలనే డిమాండ్‌తో గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ గాంధీనాయక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో శనివారం నుంచి దీక్ష చేయనున్నట్లు వెల్లడించారు. పార్టీలకతీతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులకు అనేకమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఆమరణ దీక్ష చేయాలని సంకల్పించినట్టు తెలిపారు.

బీసీల లెక్కలు తేల్చాల్సిందే

- బీసీ బహుజన సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి7 (నమస్తే తెలంగాణ): అసలు రాష్ట్రంలో ఉన్న బీసీ కులాల లెక్కలు తేల్చాల్సిందేనని బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్వేలో పాల్గొనని లక్షలాది మందిని గుర్తించి తిరిగి సర్వే చేయించి, అసలు బీసీల లెక్కలు తేల్చాలని కోరారు. బీసీ, ఎంబీసీ, సంచార జాతుల్లో ఉన్న బీసీ కులాలను గతంలో పాలించిన టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోనే లేదని, వారి అభివృద్ధికి పాటుపడలేదని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ మేరకు 42% బీసీ రిజర్వేషన్‌ను అమలు చేయాలని విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దగా చేస్తే కాంగ్రెస్‌ను దంచికొడ్తరు

42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే ● లేదంటే 'స్థానిక' ఎన్నికల్లో గుణపాఠం తప్పదు: జూలూరు

- ఆది నుంచి బీసీలను అణచివేసింది కాంగ్రెస్సే
- ఆ మచ్చ తుడుచుకోవాలంటే ఇప్పుడు చిత్తశుద్ధి చాటుకోవాలి
- కోర్టులో నిలిచేలా రిజర్వేషన్లు కల్పించాలి
- ప్రముఖ కవి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్

నమస్తే తెలంగాణ: బీసీలకు నిజంగా న్యాయం చేయాలనే ఉద్దేశం లేకపోతే కులగణన సర్వే చేసేవారు కాదనే వాదన ఉంది. దీనిపై మీ సమాధానం?

జూలూరు: బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి ఉంటే చేపట్టిన సామాజిక సర్వే అంత అసమగ్రంగా ఉంటుందా? అసెంబ్లీలో అధికారపక్షం మినహా ఏ పక్షమైనా, చివరికి ఎంఐఎం అయినా సర్వేను మెచ్చుకున్నదా? సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకు, ఎన్నికల కమిషన్ లెక్కలకు లేదా విద్యాలయాల్లో ఉన్న ఆయా వర్గాల్లో సమోదైన బీసీ లెక్కలకు పొంతన ఉండాలి కదా? అలా లేదు. పైగా బీసీల జనాభా గణనీయంగా తగ్గి.. అగ్రవర్ణ కులాల జనాభా పెరగటం ఏమిటీ? ఇలా తప్పుడు, అసమగ్ర లెక్కలను బయటపెట్టి కాంగ్రెస్ ఎవరిని మోసం చేయాలని చూస్తున్నది? ఎవరికి ద్రోహం చేయాలని చూస్తున్నదో స్పష్టమైపోయింది. సర్వే సమగ్రంగా చేయకుండా బీసీ జనాభాను ఉద్దేశపూర్వకంగా తగ్గించి కాంగ్రెస్ పెద్ద ద్రోహం చేసింది. బీసీల మనసులను గాయపరిచింది. తద్వారా కొండంత ఆశతో ఎదురుచూస్తున్న వర్గాల ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లింది.

నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయాలని మీరు కోరుకుంటున్నరు?

జూలూరు: కాంగ్రెస్ చరిత్ర పొడవునా బీసీలను అణచివేసిన చరిత్ర ఉన్నది. ఆ పేరును మార్చుకోవాలంటే కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. లేదంటే బీసీ వర్గాలు ఏకమై ఆ పార్టీని దంచికొడ్తరు. సామాజిక సర్వేలో జరిగిన పొరపాట్లను సవరించుకోవాలి. అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపామని చేతులు దులుపుకోకుండా న్యాయస్థానాల్లో నిలబడేలా పకడ్బందీగా చట్టం తేవాలి. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తరు. అందుకోసం సబ్బండ బీసీ వర్గాలు తమతమ కార్యాచరణను ప్రకటిస్తాయి. ఇప్పటికే సంఘాలవారీగా సమరశంఖం పూరించేందుకు పిలుపునిస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌కు సంబంధించి జరుగుతున్న తతంగమంతా లోతుగా పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ దానికి కట్టుబడి లేదని అనిపిస్తున్నది. కాంగ్రెస్‌కు, ఆ పార్టీ ప్రభుత్వానికి మొదటి నుంచి బీసీలను వంచించింది. సమాజంలో ఉన్న నిచ్చెన మెట్ల వ్యవస్థలో ఉన్న అసమానతలను తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న చరిత్రా ఉన్నది. వర్గాధిపత్యాన్ని పెంచి పోషించిందే కాంగ్రెస్. ఇది ఎవరూ కాదనలేని సత్యం. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరాబాదరాగా చేశామన్నట్టు చేసి చేతులు దులుపుకొనే ప్రయత్నంగా కనిపిస్తున్నది.

నమస్తే తెలంగాణ: చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని, బీసీ వర్గాలకు న్యాయం చేయడంలో తమ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని సాక్షాత్తు అసెంబ్లీలో సీఎం ప్రకటిస్తే.. మీరేమో బీసీలను ముంచిన చరిత్ర కాంగ్రెస్‌దేనని అంటున్నరు?

జూలూరు: చరిత్రాత్మకమని పాలకులు చెప్పుకోవడం కాదు, చరిత్రను నిర్మించే ప్రజలు చెప్పుకోవాలి. బీసీ కులగణన కోసం క్యాబినెట్ సబ్‌కమిటీ వేసి, ఆ కమిటీకి నివేదిక అందగానే ప్రెస్‌మీట్ పెట్టి, ఆ వెంటనే అసెంబ్లీ సమావేశం పెట్టి, ఏ వివరాలు బయటపెట్టకుండా దాన్ని చరిత్రాత్మకమంటే ఎవరు నమ్ముతరు? ఈ విషయంలో ప్రభుత్వం అనుసరించిన వైఖరి బీసీ వర్గాలను, బుద్ధిజీవులను తీవ్రంగా కలచివేసింది. ఆందోళనకు గురిచేసింది.

నమస్తే తెలంగాణ: 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలుకాని పక్షంలో తమ పార్టీ నుంచి రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టంగా చెప్పింది. ఇందులో అనుమానించాల్సింది ఏముంది?

జూలూరు: అక్కడే పెద్ద కుట్ర దాగి ఉన్నది. ఈ దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్పటి నుంచి 2023 ఎన్నికల వరకు బీసీ హక్కులపై ఉక్కుపాదం మోపిన చరిత్ర కాంగ్రెస్‌ది. కాంగ్రెస్‌ది బీసీలను నిర్దాక్షణ్యంగా తొక్కిపెట్టిన చరిత్ర. ఇంతచేసినా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వైపు ప్రజలు మొగ్గటం వల్లే రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన నిజస్వరూపాన్ని బయటపెట్టింది. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసిందే తప్ప, బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదని చరిత్ర చెప్తున్నది.

కులాల లెక్కల వెల్లడికి వెనుకంజ

- పబ్లిక్ డొమైన్‌లో పెట్టని సర్కార్
- ఉపకులాల వారీ లెక్కలూ లేనట్టే!
- ఇప్పటికే బీసీ, ఎస్సీ వర్గాల ఆగ్రహం
- కులాల లెక్కలిస్తే తప్పని వ్యతిరేకత
- వివరాలు వెల్లడికి జంకుతున్న సర్కారు
- పరిస్థితి అంచనాకు కొన్ని లీకులు

హైదరాబాద్, ఫిబ్రవరి7 (నమస్తే తెలంగాణ): కులాలు, ఉపకులాల వారీగా జనాభా లెక్కలను వెల్లడించేందుకు ప్రభుత్వం వెనుకంజ వేస్తున్నది. పూర్తి నివేదికను బయటపెట్టే విషయంలో పూర్తిగా డైలామాలో పడింది. ఇప్పటికే సర్వేను తప్పులతడకగా, పూర్తిగా అసంబద్ధంగా నిర్వహించారని, బీసీ జనాభాను 20 లక్షలకు పైగా తగ్గించారని బీసీ సంఘాల నేతలు, మేధావులు, సామాజికవేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. ఈ నేపథ్యంలో కులాలు, ఉపకులాల వారీగా నివేదికను బయటపెడితే మరింత ఇరకాటంలో, వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తి నివేదికను బయటపెట్టకుండా ఉంటేనే మంచిదని అభిప్రాయానికి వచ్చినట్టు ప్రభుత్వవర్గాలే వెల్లడిస్తున్నాయి. రెండు మూడురోజుల్లోనే పూర్తి నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెడతామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పూర్తిగా వెనుకడుగు వేసిందని అర్థమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం గత నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి సర్వేను మూడు దశల్లో చేపట్టింది. మొత్తం జనాభా 3.70 కోట్ల మంది కాగా, వారిలో 16 లక్షల మంది (3.1శాతం) సర్వేలో పాల్గొనలేదని, మిగతా 3.54 కోట్ల మంది వివరాలను సేకరించినట్టు ప్రభుత్వం ఇటీవల నివేదిక వివరాలను వెల్లడించింది. స్థూలంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ వర్గాల జనాభా లెక్కలనే తెలిపింది. బీసీ జనాభా 46.25%, ముస్లిం బీసీలు 10.08%, ఓసీ 15.79%, ఎస్టీలు 10.45% ఉన్నట్టు నిర్ధారించింది. ఆయా గణాంకాలపై అప్పటి నుంచీ తీవ్ర వ్యతిరేకత, అభ్యంతరాలు వెల్లడవుతున్నాయి.

ఉత్తదే అయిన ఉత్తమ్ హామీ

సర్వే నివేదిక వివరాలను తొలుత క్యాబినెట్ సబ్‌కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. అనంతరం రాబోయే రెండు మూడ్రోజుల్లోనే పూర్తి స్థాయి నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ఆయన ప్రకటించారు. కానీ ఇప్పటివరకు ఆ నివేదికను వెల్లడించనేలేదు. ప్రస్తుతం నివేదిక వెల్లడికి ప్రభుత్వం విముఖత చూపుతున్నదని అధికార వర్గాలే చర్చించుకుంటున్నాయి. ఊహించని విధంగా పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని చూసి ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిపోయిందని వినికిడి. ఇలాంటి సమయంలో కులాలు, ఉపకులాల వారీగా గణాంకాలపై బయటపెడితే మరింత ముప్పు తప్పదని, పుండుమీద కారం చల్లినట్టుగా ఉంటుందని సర్కారు ఆందోళనకు గురవుతున్నది.

కొన్ని కులాల లెక్కలపై లీకులు

సర్కారు కొత్త ఎత్తుగడలను వేస్తున్నది. కులాలవారీ వివరాలను వెల్లడిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు అనుకూల మీడియాకు కొన్ని కులాల వివరాలను లీకు చేస్తూ వస్తున్నది. ఇప్పటికే 5 మెజార్టీ బీసీ కులాల లెక్కలపై లీకులిచ్చింది. ముదిరాజ్‌లు 36 లక్షలకు పైగా ఉంటారని, 26 లక్షల జనాభాతో గౌడ సామాజికవర్గం, యాదవులు, మున్నూరు కాపులు, పద్మశాలి సామాజిక వర్గాలు ఇంతమంది ఉన్నారంటూ ఓ మీడియాలో వార్తలు వచ్చాయి. ఎలాంటి వివాదాలు, ఆందోళనలు లేకుంటే పూర్తిస్థాయి నివేదికను విడుదల చేసి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు అధికార వర్గాలు, ఆ పార్టీ నేతలే వివరిస్తున్నారు.

పూర్తి నివేదికకు పెరుగుతున్న డిమాండ్

ఇంటింటి సర్వే నివేదికను పూర్తిస్థాయిలో వెల్లడించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, కులసంఘాలు, సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. వాస్తవ అంచనాలకు పూర్తి విరుద్ధంగా జనాభాను తగ్గించి చూపారని బీసీ, ఎస్సీ వర్గాలు మండిపడుతున్నాయి. ఏ మేరకు, ఏ జిల్లాలో, ఎందువల్ల? ఏ బీసీ కులాల, ఉపకులాల జనాభా తగ్గిందో తెలిపాలని కోరుతున్నారు. అన్ని కులాల వారీగా జనాభా వివరాలు, ఆర్థిక స్థితిగతులు, ఏ కులం అధికంగా రాజకీయ అవకాశాలను పొందింది? ఏ కులం తక్కువ అవకాశాలను పొందింది? తదితర వివరాలను నివేదించాల్సిందేనని పట్టుబడుతున్నారు. సర్వే సమయంలో చాలావరకు తమ వివరాలనే నమోదు చేయలేదని, గణాంకాలను ఏమేరకు తగ్గించారోనని సంచార జాతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సమాజాన్ని ఒకే జాతీయులుగా కాకుండా, రెండు వేర్వేరు వర్గాలుగా విభిజించి చూపారని, దీంతో తమ జనాభాను తక్కువ చూపే అవకాశం ఉన్నదని ఆ కులసంఘాలు మండిపడుతున్నాయి. ఇదే తరహాలో అన్నికులాలు తమ వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను వేరు చేయొద్దు

సర్వే తుది నివేదికలో విభజిస్తే ఉద్యమిస్తాం ● విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం హెచ్చరిక

సమావేశంలో మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటాచారి

హైదరాబాద్, ఫిబ్రవరి7 (నమస్తే తెలంగాణ): కులగణన తుది నివేదికలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ వృత్తిదారులను విభజించి చూపితే సహించబోమని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సర్వేలో వేర